పొలం గట్లపై చెట్ల నరికివేత

- పర్యావరణానికి ముప్పు
- పొలాల్లో వ్యర్థాలకు నిప్పు
- దగ్ధమవుతున్న మొక్కలు
- రైతులకు అవగాహన కల్పిస్తే మేలు

పుల్లలచెరువు: వృక్షో రక్షతి రక్షితః అన్నారు పెద్దలు. మానవ జాతి మనుగడకు చెట్లు ఎంతో మేలు చేస్తాయి. ప్రస్తుతం వ్యవసాయ పనులు పూర్తి కావడంతో రైతులు పొలాలను బాగు చేసుకునే పనుల్లో నిమగ్నమయ్యారు. పొలాల్లోని వ్యర్థాలకు కొందరు నిప్పు పెడుతుండటంతో గట్లపై ఉన్న మొక్కలు కాలిపోతున్నాయి. వర్షాకాలంలో వికసించి మొగ్గలు తొడిగిన మొక్కలు వేసవి రాగానే కాలి బూడిదైపోతున్నాయి. కొందరు రైతులు అవగాహన రాహిత్యంతో చేస్తున్న పనులతో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతోంది.

ఇదీ..గ్రామాల్లో పరిస్థితి

కొందరు రైతులు పొలాల్లో ఉన్న చెత్తను తగలబెడుతున్నారు. పంట దిగుబడి ముగిసిన తర్వాత వేసవి కాలంలో రైతులు శుభ్రం చేస్తున్న సమయంలో పొలంలో లభ్యమైన పంట వ్యర్థాలను కుప్పలు వేసి దహనం చేస్తున్నారు. మరి కొందరు రైతులు పొలం గట్లపై ఉన్న గడ్డిని శుభ్రం చేసే క్రమంలో రోడ్డు అంచున ఉన్న చెట్లు, మొక్కలు పూర్తిగా కాలిపోతున్నాయి. మండలంలోని చాలా గ్రామాల్లోని రైతులు ఇలా చేస్తుండటంతో చెట్లు, మొక్కలు అంతమవుతున్నాయి.

మొక్కలు ఉంటే రైతులకు ఉపయోగం

మొక్కలతో ఎన్ని విధాలా మేలో అందరికీ తెలిసిందే. మానవాళికి కాక పొలాల్లో వేసిన పంటలకు కూడా మొక్కలు ఎంతో ఉపయోగపడతాయి. పొలం గట్లు, రహదారుల వెంట మొక్కలు పెంచితే చీమలు, చిన్న పురుగులు చుట్టుపక్కల చేరతాయి. మొత్తంగా ఒక్కో చెట్టుపై సుమారు 500 రకాల జీవాలు ఆవాసం ఏర్పరుచుకుంటాయని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. ఇవన్నీ పర్యావరణాన్ని రక్షించడంలో కీలక పాత్రను పోషిస్తాయి. చెట్లపై చేరిన పక్షులు పొలంలోని చీడపీడల్నీ తినేస్తాయి. రైతులకు రసాయన మందుల వినియోగం తగ్గుతోంది. పెట్టుబడులు కూడా తగ్గే అవకాశం ఉంది. అనుకోని గాలివాన వచ్చినప్పుడు పొలం గట్లపై ఉన్న మొక్క పాతిక కిలోల భూసారాన్ని కాపాడుతుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.



పొలం గట్లపై తగలబడుతున్న మొక్కలు

పంట వ్యర్థాలను భూమిలోనే దున్నేయాలి

పంట దిగుబడి పూర్తయిన వెంటనే వ్యర్థాలను కొందరు రైతులు కుప్పలు వేసి దహనం చేస్తున్నారు. అలా చేయడం మంచి పద్ధతి కాదు. అలా చేస్తే భూమి సారాన్ని కోల్పోతుంది. భూమిలో ఉండే కర్బన రసాయనాల స్థాయి తగ్గిపోతుంది. పంట వ్యర్థాలను యంత్రాల సాయంతో తిరిగి భూమిలోనే కలియదున్నుకుంటే వ్యర్థాలు కంపోస్టుగా మారుతుంది. మొక్కల ఎదుగుదలకు అవసరమైన నత్రజని, ఇతర పోషకాల శాతం పెరుగుతుంది.

– నిర్మలాదేవి, వ్యవసాయాధికారి, పుల్లలచెరువు

క్లుప్తంగా

పొలంలోని పోషక విలువలు తెలుసుకోవాలి



మట్టి నమూనాపై శిక్షణ ఇస్తున్న ఏవో శేషారెడ్డి

యర్రగొండపాలెం: రైతులు తమ పొలంలోని పోషక విలువలు తెలుసుకుంటే పంటకు వాడాల్సిన స్థూల, సూక్ష్మ పోషకాల వివరాలు తెలుస్తాయని, దీంతో తక్కువ ఖర్చుతో ఎక్కువ పంట దిగుబడి పొందవచ్చని ఏవో కేవీ శేషారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని పందివానిపల్లిలో భూసార పరీక్షల నమూనాలు సేకరించే విధానంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టి నమూనాలు సేకరించే సమయంలో చెట్లకింద, గట్ల పక్కన, కంచెల దగ్గర, పశువుల ఎరువులు, కాలిబాట ఉన్న ప్రాంతల్లో నమూనాలు తీయరాదని, ప్రతి రైతు గ్రామ రైతు సేవా కేంద్రంలో మట్టి నమూనా పరీక్షించే యాప్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఏఈవో ఎల్.మాల్యాద్రిరెడ్డి పాల్గొన్నారు.

భక్తి పరవశం.. బ్రహ్మోత్సవం



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీదేవి అమ్మవారు

కొనకనమిట్ల: మండలంలోని పెదారికట్ల గ్రామంలో శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి, పార్వతీ సమేత రాజనగరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వేడుకగా సాగుతున్నాయి. శుక్రవారం చెన్నకేశవ స్వామివారు హనుమంత వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవ ఉభయ దాతలుగా కోడూరి, బొర్రా కుటుంబ సభ్యులు వ్యవహరించారు. వేదపండితులు నంద్యాల వెంకట కృష్ణ కిరణ్, నుదురుపాటి వెంకటకృష్ణారావు స్వామి వారికి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. శనివారం శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి కల్యాణం నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కమిటీ సభ్యులు తెలిపారు.

కార్యకర్తలకు ఎమ్మెల్యే బూచేపల్లి పరామర్శ



చింతంరెడ్డి బోరెడ్డి రిపోర్టులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి



చేరెడ్డి సుబ్బారెడ్డిని పరామర్శిస్తున్న బూచేపల్లి

తాళ్లూరు: మండలంలోని వెలుగువారిపాలెం గ్రామానికి చెందిన చింతంరెడ్డి బోరెడ్డి, చేరెడ్డి సుబ్బారెడ్డిలు గుండె సంబంధిత సమస్యతో బాధపడుతూ ఇటీవల ఆస్పత్రుల్లో స్టంట్ వేయించుకున్నారు . విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి శుక్రవారం వారిని కలిసి ఆరోగ్య విషయాలు తెలుసుకొని పరామర్శించారు. పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ అండగా ఉంటానని ధైర్యం చెప్పారు.

గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకున్నారు. సర్పంచ్ ముచ్చుమారి బ్రహ్మారెడ్డి, మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడులను రక్షించుకుందాం..

- యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు

దర్శి (కురిచేడు): ప్రభుత్వ బడులను రక్షించుకుందామని, ఎన్‌రోల్‌మెంట్ పెంచుకుందామని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. స్థానిక పీజీఎన్ కళ్యాణ మండపంలో శుక్రవారం దాచూరి రామిరెడ్డి స్మారకోపన్యాస సభ జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్ హై అధ్యక్షతన జరిగింది. సభకు వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రామిరెడ్డి వర్ధంతి సందర్భంగా తొలుత పాత కోర్టు సెంటర్‌లో దర్శి డివిజన్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం కళ్యాణ మండపంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్, గౌరవ అధ్యక్షుడు కొమ్మోజు శ్రీనివాసరావులు రామిరెడ్డికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను రక్షించుకోవడం రామిరెడ్డి వారసులుగా ప్రతి ఒక్కరి బాధ్యతని గుర్తు చేశారు. పోరాటమే హక్కుల సాధనకు మార్గమన్నారు. భారత రాజ్యాంగం పీటికను విద్యార్థులకు తెలియజేయాలని, సమ సమాజం స్థాపన కోసం యూటీఎఫ్ పనిచేస్తోందన్నారు. రాజుల కాలం నుంచి ప్రజాస్వామ్య వ్యవస్థలోకి వచ్చామని, ఈ ప్రజాస్వామ్యం రాజ్యాంగం ద్వారా మాత్రమే సాధ్యమని తెలిపారు. జిల్లా గడ్డపై నడయాడిన దాచూరి రామిరెడ్డి ఆశయాల కోసం ప్రతి యూటీఎఫ్ కార్యకర్త పనిచేయాలని, రామిరెడ్డి ఆశయాలను అతిక్రమించి పనిచేసిన ఏ ఒక్క వ్యక్తి యూటీఎఫ్ కార్యకర్త కారని రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు ఘాటుగా అన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ఉద్యోగ, ఉపాధ్యాయులు, కార్మికులకు రావాల్సిన రూ.20 వేల కోట్లు విడుదల చేయాలని, పీఆర్సీని ప్రకటించాలని ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పది లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ బడులను వీడారని, దీనికి కారణం ప్రభుత్వ ఆర్థిక సంస్కరణలేనన్నారు. ప్రభుత్వ పెట్టుబడులు తగ్గించాలనే ఆలోచనలో భాగంగా టెక్నాలజీని పెంచాలనే ప్రపంచ బ్యాంకు ఆలోచనలకు అనుగుణంగా ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వీరాంజనేయులు, గౌరవ అధ్యక్షుడు ఎస్.రవి, ఆడిట్ కమిటీ కన్వీనర్ రాము, జిల్లా సహాధ్యక్షుడు జి.ఉమామహేశ్వరి, కోశాధికారి చిన్న స్వామి, జిల్లా కార్యదర్శులు మీనిగ శ్రీను, టి.రాజశేఖర్, రాష్ట్ర కౌన్సిలర్ జి.కోటేశ్వరరావు, కుటుంబ సంక్షేమ డైరెక్టర్ జి. విజయకుమార్, ఈ.రోశయ్య, దర్శి మండల అధ్యక్ష, కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, పి.ఖాసిం, శ్రీనివాసరెడ్డి, బి. వెంకటేశ్వర్లు, కె.సురేష్‌బాబు, ఎంవీ రమణారెడ్డి, మండల విద్యాశాఖాధికారులు కె.రఘురామయ్య, బి. రమాదేవి, యూటీఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే తాటిపర్తి పరామర్శలు

పుల్లలచెరువు: మండలంలోని పలు గ్రామాల్లో మృతి చెందిన ఇద్దరు వైఎస్సార్ సీపీ కార్యకర్తల మృతదేహాలకు స్థానిక శాసనసభ్యుడు తాటిపర్తి చంద్రశేఖర్ శుక్రవారం నివాళులర్పించారు. చాపలమడుగు గ్రామానికి చెందిన యోహాన్, వెంకటరెడ్డిపల్లికి చెందిన సుబ్బారెడ్డి మృతి చెందడంతో భౌతిక కాయాలను సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ ఇద్దరు మంచి కార్యకర్తలను కోల్పోయిందని విచారం వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుముల శ్రీనివాసరెడ్డి, సర్పంచ్‌లు సత్యనారాయణరెడ్డి, కోటిరెడ్డి, నాయకులు బి.సుబ్బారెడ్డి, శివారెడ్డి, ఉమామహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తకు పరామర్శ

యర్రగొండపాలెం: ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వైఎస్సార్ సీపీ కార్యకర్త, పట్టణానికి చెందిన షేక్ సిలార్‌ను ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆర్థిక సాయం అందజేశారు. గత నెల 24వ తేదీన మండలంలోని బోయలపల్లికి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పట్టణానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు టి.లక్ష్మీనారాయణ కుమారుడు దిలీప్ మృతి చెందాడు. ఎమ్మెల్యే వారింటి వద్దకు వెళ్లి ఆ కుటుంబానికి సానుభూతి తెలిపి ధైర్యం చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ దొంతా కిరణ్ గౌడ్, పార్టీ జిల్లా కార్యదర్శి కొప్పర్తి చిన్న ఓబులరెడ్డి, మండల అధ్యక్షుడు ఏకుల ముసలారెడ్డి, ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు పబ్బిశెట్టి శ్రీనివాస్, వైస్ ఎంపీపీ ఎం.ఆదిశేషు, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, బూత్ కమిటీల నియోజకవర్గ కన్వీనర్ ఒంగోలు సుబ్బారెడ్డి, వాణిజ్య విభాగం కన్వీనర్ కందూరి కాశీవిశ్వనాథ్, సూరె ప్రసాద్, వై.రాంబాబు, షేక్ కాశిం, సర్పంచ్‌లు ఆర్.అరుణాబాయి, ఆవుల కోటివీరారెడ్డి పాల్గొన్నారు.



యోహాన్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి



సిలార్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి

భూసార పరీక్షల ఆధారంగా పంటలు సాగు చేయాలి

కురిచేడు: భూసార పరీక్షల ఆధారంగా పంటలు సాగు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి పి.మధుబాబు తెలిపారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో రైతులకు శుక్రవారం మట్టి నమూనాలు సేకరించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు రైతులకు తెలిపారు. ప్రతి రైతు సేవా కేంద్రానికి 55 మట్టి నమూనాలు టార్గెట్‌గా ఇచ్చినట్లు పేర్కొన్నారు. భూసార పరీక్షలతో మట్టిలో ఉన్న పోషకాలు విలువ తెలుస్తుందని, భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వేస్తే పెట్టుబడి తగ్గి దిగుబడి పెరుగుతుందన్నారు. మట్టి నమూనా పరీక్షించేందుకు నిర్దేశించిన ఎస్‌హెచ్‌సీ యాప్‌లో రైతులు తమ పేర్లను వారి రైతు సేవా కేంద్రంలో నమోదు చేసుకోవాలన్నారు. అలా నమోదు చేసుకున్న రైతుల పొలాల్లో వ్యవసాయ శాఖ సిబ్బంది మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షలు చేయిస్తారని, వాటి ఫలితాల ఆధారంగా ప్రభుత్వం సూక్ష్మ పోషకాలు రాయితీపై అందిస్తోందన్నారు. అనంతరం మట్టి నమూనా సేకరణ చేశారు.



మట్టి సేకరిస్తున్న ఏఓ, సిబ్బంది

ఎమ్మెల్యే తాటిపర్తితో వీహెచ్‌పీ నేతల భేటీ

యర్రగొండపాలెం: ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్‌ను విశ్వహిందూ పరిషత్ జాతీయ కార్యదర్శి యక్కలి రాఘవులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కలిసిన వీరు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై చర్చించుకున్నారు. ఈ సందర్భంగా రాఘవులు, ఆయన వెంట ఉన్న త్రిపురాంతకేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ ఇమ్మడిశెట్టి వెంకట సుబ్బారావులను ఎమ్మెల్యే శాలువా కప్పి సన్మానించారు.



రాఘవులు, సుబ్బారావును సన్మానిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి

రోజురోజుకూ ముదురుతున్న స్థల వివాదం



స్థలం సమాచారం లేదని అధికారులు ఇచ్చిన వివరణ



నిరసన వ్యక్తం చేస్తున్న మరియబాబు కుటుంబ సభ్యులు

కురిచేడు: స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం సమీపంలో స్థలం వివాదాస్పదంగా మారింది. సర్వే నంబర్ 246–2ఏలో స్థలం గతంలో ఆర్టీసీ బస్టాండు కోసం కేటాయించారు. కాలక్రమేణా ఆర్టీసీ ఆ స్థలాన్ని వినియోగించుకోలేదు. దానిలో గ్రామ పంచాయతీ కార్యాలయం, సచివాలయం, పంచాయతీ వాటర్ స్కీం ఓవర్ హెడ్ ట్యాంకు, స్త్రీ శక్తి భవనం, ఎన్ఆర్ఈజీఎస్ భవనం, రైతు భరోసా కేంద్రం నిర్మించారు. మిగిలిన స్థలంలో రైతులు గతంలో వామిదొడ్లుగా ఉపయోగించారు. కొందరు ఇదే అదనుగా విక్రయించగా మరికొందరు ఆక్రమణలు చేశారు. ఈ స్థలానికి సంబంధించి సమాచార హక్కు చట్టం ద్వారా వివరణ కోరితే ఆ స్థలానికి సంబంధించి ఎలాంటి రికార్డులు రెవెన్యూ కార్యాలయంలో లేవని అధికారులు వివరణ ఇచ్చి సరిపెట్టుకోవడం వారి పనితీరుకు అద్దం పడుతోంది. ఆ మధ్య ఖాళీ స్థలంలో కంభంపాటి మరియబాబు వాటర్ సర్వీసింగ్ ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. దాన్ని ఆరు నెలల క్రితం కొందరు కూలగొట్టి అక్కడ భవనం నిర్మించారు. దానిపై మరియబాబు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. శుక్రవారం మరియబాబు కుటుంబ సభ్యులు రెవెన్యూ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగినా అధికారులు పట్టించుకోలేదు. ఈ విషయమై మరియబాబు లోకాయుక్తను ఆశ్రయించారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. జిల్లా అధికారుల ఆదేశాలు, లోకాయుక్త ఆదేశాలను కూడా ఖాతరు చేయకుండా స్థానిక రెవెన్యూ అధికారులు వ్యవహరిస్తున్నారని మరియబాబు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. తనకు జీవనోపాధి లేకుండా చేశారని, తనకు న్యాయం చేయాలని మరియబాబు కోరుతున్నాడు.

తీగలేరు కాలువతోనే సస్యశ్యామలం

పుల్లలచెరువు: తీగలేరు కాలువ నీరు వస్తేనే గ్రామం సస్యశ్యామలం అవుతుందని సుద్దకురవ తండా సర్పంచ్ వెంకటేశ్వరనాయక్ అన్నారు. తీగలేరు కాలువ సాధన సమితి ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని సుద్దకురవ తండాలో పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు. సర్పంచ్ మాట్లాడుతూ మండలంలోని చాలా గ్రామాల్లో తాగు, సాగు నీరు లేక ఇబ్బందులు పడుతున్నారని, రాబోయో రోజుల్లో ఈ ప్రాంతంలో శాశ్వత నీటి సౌకర్యం లేకుంటే ఏడారిగా మారే పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఈ ప్రాంత ఆకాంక్షణమైన వెలుగొండ ప్రాజెక్టు పనులు సకాలంలో పూర్తి చేసి దానికి అనుసంధానంగా ఉన్న టీ5 కాలువను చిన్నకండ్లేరు ప్రాజెక్టు వరకు పొడిగించి దాన్ని ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని కోరారు. కమిటీ సభ్యులు గురునాథం, రఘు మాట్లాడుతూ ప్రభుత్వాలు, రాజకీయనాయకులు మారుతున్నారుగానీ వెలుగొండ ప్రాజెక్టు పనులు పూర్తి చేయక పోవడంతో ఈ ప్రాంత రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, రాష్ట్రంలో అన్ని ప్రాంతాలకు శాశ్వత నీటి సౌకర్యం ఉందని, పశ్చిమ ప్రాంతంలో ఉండే ప్రజలు నీటి కోసం భగీరథ యత్నం చేస్తున్నారని, ప్రభుత్వం నుంచి స్పందన వచ్చే వరకు పోస్టు కార్డు ఉద్యమం ఆగదని, మండలంలోని ప్రతి రైతు ఈ ఉద్యమానికి సహకరించాలని కోరారు. కమిటీ సభ్యులు కోటిరెడ్డి, వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ హనుమానాయక్, నాయకులు ఠాగూర్ నాయక్, శ్రీనునాయక్, ధర్మానాయక్, జీబ్రానాయక్, బాలునాయక్, వెంకటేశ్వర్లు నాయక్ పాల్గొన్నారు.



పోస్టుకార్డు ఉద్యమంలో రైతులు


కొనకనమిట్ల మండలంలో మోస్తరు వర్షం



గొట్లగట్టులో కారుమబ్బులు

కొనకనమిట్ల: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. గొట్లగట్టు, చిన మనగుండం, పాతపాడు, బచ్చలకూరపాడు, నాగంపల్లి, సలనూతల, వింజవర్తిపాడు గ్రామాల్లో కురిసిన వర్షానికి లోతట్టు పొలాల్లో నీరు చేరింది. గొట్లగట్టు పంచాయతీ కార్యాలయం, మెయిన్ రోడ్ స్పీడ్ బ్రేకర్ వద్ద వర్షం నీరు నిల్వ చేరడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ఘనంగా బ్రహ్మంగారి తిరునాళ్ల



అలంకరణలో వీరబ్రహ్మేంద్ర స్వామి



పూజలకు హాజరైన భక్తులు

దొనకొండ: స్థానిక అడ్డ రోడ్డులో వెలసిన శ్రీ ఆనంద ఆశ్రమం 11 వార్షిక మహోత్సవం తిరునాళ్లను భక్తులు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉదయం 6 గంటల నుంచి వీరబ్రహ్మ సుప్రభాతం, 8 గంటల నుంచి ఆశ్రమంలో వేచి ఉన్న సకల దేవతలకు పంచామృత అభిషేకాలు, అలంకరణలు చేశారు. ఉదయం 9 గంటల నుంచి శ్రీ గోవిందమాంబ వీరబ్రహ్మేంద్ర స్వామి కళ్యాణ మహోత్సవం వైభంగా నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని వీర బ్రహ్మేంద్రుల స్వామి వారికి నైవేద్యాలు సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం 7 గంటల నుంచి అచలానంద స్వామి వారి ప్రియ శిష్యులు శ్రీ పరిపూర్ణ సిద్ధాంత స్వామి ప్రవచనాలు, రాత్రి 8 గంటల నుంచి కోలాట బృందంతో కోలాటం, బ్రహ్మంగారి నాటకం ప్రదర్శించేందుకు సిద్ధం చేశామని భైరవానంద స్వామి తెలిపారు. తిరునాళ్లకు విచ్చేసిన భక్తులకు అన్నదానం చేశారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కాకర్ల కృష్ణారెడ్డి దంపతులు, ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళి దంపతులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కిశోర వికాసం ప్రారంభం



కిశోర బాలికలు, అంగన్‌వాడీ టీచర్లు

పెద్దదోర్నాల: మండల పరిధిలోని తిమ్మాపురంలో కిశోర వికాసంలో భాగంగా మొదటి రోజు తిమ్మాపురం అంగన్‌వాడీ కేంద్రంలో ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీడీపీఓ కమల కుమారి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించటంతో పాటు విద్య, పోషణ, వ్యక్తిత్వ వికాసం లక్ష్యంగా ఈ కార్యక్రమం రూపొందించినట్లు పేర్కొన్నారు. కిశోర బాలికలు శుభ్రమైన జీవనశైలి, ఆరోగ్యకర ఆహారపు అలవాట్లపై సమగ్రంగా అవగాహన కల్పించేందుకు దృష్టి సారించాలని సూచించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అంజమ్మ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా బాలికలు తమ శారీరక, మానసిక అభివృద్ధికి అవసరమైన అంశాలు తెలుసుకుంటారన్నారు. తల్లిదండ్రులు, సంఘ సభ్యులు దీన్ని ప్రోత్సహించాలని సూచించారు. బాలికలతో పోషణ ఆహారం గురించి అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్లు సుహాసిని, రామలక్ష్మీకుమారి, రాణి, ఏఎన్ఎం స్వర్ణలత, మహిళా పోలీస్ అనంతలక్ష్మి, కిశోర బాలికలు పాల్గొన్ని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

భక్తిశ్రద్ధలతో శంకర జయంతి

మార్కాపురం: జగద్గురు ఆది శంకరాచార్య జయంతిని మార్కాపురం పట్టణంలోని శివాలయంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శంకరాచార్యుల విగ్రహాన్ని అర్చకులు హరిప్రసాద్ శర్మ ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం చేశారు. మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, గణపతి హోమం, రుద్ర హోమాలు నిర్వహించారు. అనంతరం సాముహిక ఉచిత ఉపనయనాలను అర్చకులు రెంటచింతల రామకృష్ణ చేశారు. మధ్యాహ్నం బ్రాహ్మణ సమారాధన జరిగింది. కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు తంగిరాల నాగజగన్నాథ్, ఓపీ మల్లిక్, పురాణం సుబ్రమణ్యం, ఏఎల్ఎన్‌వీ సుబ్బారావు, సోమయాజుల శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: సనాతన ధర్మాన్ని పరిరక్షించిన జగద్గురు ఆదిశంకరాచార్యులు అందరికీ ఆరాధ్యులని రామకృష్ణ ధ్యాన మందిరం నిర్వాహకులు పి.హనుమంతారెడ్డి పేర్కొన్నారు. ఆదిశంకరాచార్యుల జయంతి సందర్భంగా పట్టణంలోని కాశినాయన కుంట ఆవరణలో గల గాయత్రిమాత ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్న సంతర్పణ చేశారు.



మార్కాపురంలో ఆది శంకరాచార్యులకు పూజలు చేస్తున్న అర్చకులు



గిద్దలూరులో పూజల్లో పాల్గొన్న భక్తులు